ఓపెన్ స్కూల్ ప్రవేశాలపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: చదువుతూ వివిధ కారణాలతో మధ్యలో మానేసిన విద్యార్థులకు శారద విద్యాపీఠం ద్వారా ప్రభుత్వం నిర్వహిస్తున్న ఓపెన్ స్కూల్ విధానం మంచి అవకాశమని ఓపెన్ స్కూల్ ఏరియా కోఆర్డినేటర్ జి దాసు బాబు చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఓపెన్ స్కూల్ విధానంపై కళాశాల విద్యార్థులకు శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయస్సు 15 ఏళ్లు దాటి పదవ తరగతి, ఇంటర్మీడియట్ మధ్యలో మానేసిన విద్యార్థులతో పాటు చదువుకోవడానికి ఆసక్తి ఉన్నవారిని కూడా ఓపెన్ స్కూల్‌లో జాయిన్ చేసి విద్యను కొనసాగించడం జరుగుతుందన్నారు. దీనిపై కళాశాల విద్యార్థులు గ్రామాల్లో అవగాహన కల్పించి చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దాసు

గెడ్డలో బోటుపై కూర్చుని నిరసన తెలుపుతున్న నాయకులు, గిరిజనులు

వంతెన నిర్మించాలని..

ఆదివాసీ గిరిజన సంఘం నేతల నిరసన

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ఇటీవల కురిసిన వర్షాలకు జోలపుట్టు రిజర్వాయర్ ఉప్పొంగడంతో 14 గ్రామాల ఆదివాసులు జల దిబ్బందానికి గుర్రై నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు సైతం ఇబ్బందులను ఎదుర్కొన్నారని ఆదివాసి గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం ఎం శ్రీను ఆధ్వర్యంలో శనివారం కుమ్మరి పుట్టు గెడ్డ రేవు వద్ద బోటులో నిరసన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కమిటీ సభ్యులు, లక్ష్మీపురం సర్పంచ్ కొర్ర త్రినాథ్ హాజరయ్యారు. మండల కమిటీ సభ్యుడు సొలగం గాసిరం దొర మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లా జడ్పీ చైర్ పర్సన్ సుభద్ర వంతెన నిర్మాణాలకు 10 కోట్లు నివేదికలు పంపించామని చెబుతున్నారే తప్ప నేటి వరకు వాటిని ప్రారంభం చేసిన దాఖలాలు లేవని విమర్శించారు.

ఆదివాసి గిరిజన జిల్లా కమిటీ సభ్యుడు కొర్ర త్రినాథ్ మాట్లాడుతూ, మండలంలో జోలపుట్టు రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడంతో వ్యవసాయ పంట పొలాలు హెక్టార్లలో నష్టపోయిందని, ముప్పు ప్రాంతం లో ఉన్న ఆదివాసులకు జీవన ఉపాధి కోల్పోయారని గుర్తు చేశారు. సుజన కోట పంచాయతీ కుమ్మరి పుట్టు గెడ్డ రేవు నుండి సుమారు 14 గ్రామాల గిరిజనులు నాటు పడవలలో రాకపోకలు సాగిస్తున్నారన్నారు. గెడ్డ ఉధృతితో గతంలో అనేకమంది ప్రాణాలు కోల్పోయారన్నారు. ఇప్పటికైనా ఆదివాసి గిరిజనుల ముంపు ప్రాంత ప్రజల కష్టాలను ప్రభుత్వం గుర్తించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూలుకొని వంతెన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. లేనిపక్షంలో ముంపు ప్రాంత 14 గ్రామాల ప్రజలతో జిల్లా కలెక్టర్ కార్యాలయం, ఐటీడీఏ కార్యాలయం, మండల కేంద్రం ఎంపీడీవో కార్యాలయలు ముట్టడి, రాస్తారోకోలు, నిరసనలు చేపట్టేందుకు సంసిద్ధంగా ఉన్నామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

డిఎస్‌సి కోచింగ్‌కు ఏర్పాట్లు చేయండి

-ఐటిడిఎ పిఒ అభిషేక్

ప్రజాశక్తి-పాడేరు: రాష్ట్ర ప్రభత్వం మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసిన నేపధ్యంలో గిరిజన యువతకు డిఎస్సీ కోచింగ్ అందించడానికి ఏర్పాట్లు చేయాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ ఆదేశించారు. శనివారం ఐటిడిఏ వీడియో కాన్ఫరెన్స్ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు 300 మంది నిరుద్యోగ గిరిజన అభ్యర్థులకు డి ఎస్సీ శిక్షణ అందిస్తామన్నారు. అభ్యర్థులు బి.ఇడి, డి. ఇడి, టెట్ పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. డిగ్రీ, బిఇడి, లేదా డిఇడి టెట్లో సాధించిన మార్కుల ఆధారంగా లేదా స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహించి నిబంధనల మేరకు ఎంపిక చేస్తామన్నారు. మహిళలకు నిర్దేశించిన నిబంధనల మేరకు రిజర్వేషన్లు అమలు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుల స్వీకరణ, ఎంపిక విధానం, శిక్షణ సెంటర్, ఎంతకాలం శిక్షణ అందిస్తామనే పూర్తి వివరాలను ప్రకటిస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారులు వి.ఎస్. ప్రభాకర్, ఎం.వేంకటేశ్వరరావు, గిరిజన సంక్షేమ శాఖ ఉపసంచాలకులు ఐ.కొండల రావు, డిఇఓ బ్రహ్మాజీరావు, ఎటిడబ్ల్యూఓ ఎల్.రజని తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పిఒ

మాదక ద్రవ్యాల దుష్ప్రభావంపై అవగాహనా సదస్సులు

-జిల్లా కలెక్టర్ ఎ.ఎస్. దినేష్ కుమార్

ప్రజాశక్తి-పాడేరు : మాదక ద్రవ్యాల వినియోగం, సమాజంపై దుష్ప్రభావాలపై ప్రజలు, విద్యార్థుల్లో చైతన్యం కలిగించడానికి అవగాహన సదస్సులు నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎ. ఎస్. దినేష్ కుమార్ విద్యా సంస్థలను ఆదేశించారు. గిరిజనుల ఆరోగ్య పరిరక్షణకు ఆగస్టు 15 వతేదీలోగా మూడు ప్రత్యేక వైద్య శిబిరాలను నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ, ఐటిడిఏ అధికారులను ఆదేశించారు. విశాఖపట్నం జిల్లా న్యాయ సేవాప్రాధికార సంస్థ కార్యదర్శి సూచనల మేరకు సంబంధిత అధికారులకు శనివారం ఉత్తర్వులు జారీ చేసారు. గిరిజన హక్కుల పరిరక్షణకు, మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే చేటు తదితర అంశాలపై స్వచ్ఛంద సంస్థల సహకారంతో తగిన చర్యలు చేపట్టాలని స్పష్టం చేసారు. వైద్య శిబిరాలలో, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు పాల్గొనాలని ఆదేశించారు. లీగల్ సెల్ ఆథారిటీ ఆధ్వర్యంలో గిరిజనులకు ఉచిత న్యాయ సలహాలు, సూచనలు అందిస్తారని చెప్పారు. గిరిజన మహిళలు లీగల్ సెల్ అధారిటీ అందిస్తున్న ఉచిత న్యాయ సలహాలు సూచనలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోడు పట్టాలివ్వాలని ..

సిపిఎం ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి- అనంతగిరి: తాతముత్తాతల కాలం నుండి సాగులో ఉన్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యాన శనివారం తహాశీల్దార్ కార్యలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జడ్పీటీసీ దీసరి గంగరాజు మాట్లాడుతూ, నాన్ షెడ్యూల్ రొంపిలి పంచాయతీ పరిది కరకవలస గ్రామనికి చెందిన 20 మంది పైగా పోడు భూములకు నమ్ముకుని జీవనం కొన సాగిస్తున్నారని తెలిపారు. 19 సంవత్సరాలు గడుస్తున్నా ఆదివాసీ గిరిజనులకు అటవీ హక్కు పత్రాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి గిరిజనుల సాగులో ఉన్న భూములను సర్వే చేసి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం డిప్యూటీ తహాశీల్దార్ ఎం.మాణిక్యంను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకుడు కందుల పూర్ణనందు, కోటపర్తి సన్యాసి, జన్ని సన్యాసి, జాగడ గంగులు, గిరిజనులు పాల్గొన్నారు.

ధర్నా చేపడుతున్న జెడ్‌పిటిసి గంగరాజు, రైతులు

గంజాయి సాగు చట్టరీత్యా నేరం

ప్రజాశక్తి-హుకుంపేట: గంజాయి సాగు, రవాణ చట్ట రీత్యా నేరమని సిఐ సన్యాసిరావు శనివారం స్థానిక వారపు సంతలో ప్రచారం చేపట్టారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, గంజాయి రవాణాపై సమాచారాన్ని అందించాలని కోరారు. యవత చెడు వ్యసనాలకు బానిసలు కాకూడదన్నారు. ఆగస్టు 15 సందర్భంగా ఆటల పోటీలో గెలిచిన విద్యార్థులకు పోలీస్ శాఖ తరుపున బహుమతులు ప్రదానం చేస్తామని సిఐ పేర్కొన్నారు.

ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మినీ గోకులాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి- పెదబయలు: పశువుల సంరక్షణ కోసం మినీ గోకులాలకు ఎస్టీ, ఎస్సి రైతులు సకాలంలో సచివాలయం పశువైద్య సహాయకులకు తమ దరఖాస్తులు ఇవ్వాలని పశుసంవర్ధకశాఖ ఏడి రాజా రవికుమార్ తెలిపారు.స్థానిక పశువైద్య కార్యాలయంలో శనివారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రెండు పశువుల గోకులానికి రూ.1,15 లక్షలు 90శాతం సబ్సిడీ ఉంటుందన్నారు. నాలుగు పశువులకు 1.85 లక్షలు, ఆరు పశువులకు 2,30 లక్షలు ప్రభుత్వం ద్వారా సహాయం అందించనున్నట్లు తెలిపారు. అర్హులు ఆధార్, రేషన్ కార్డు, మూడుపాస్ ఫోటోలు, కుల ధ్రువీకరణ పత్రం భూమి పట్టా జెరాక్స్ కాపీలు సమర్పించాలనన్నారు.

చట్టాలపై అవగాహన ఉండాలి

ప్రజాశక్తి-చింతపల్లి: ప్రభుత్వ శాఖలన్నీ సమన్వయంతో పని చేస్తే ప్రజలకు చట్టాలు, హక్కులపై అవగాహన ఏర్పడుతుందని విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం వెంకట శేషమ్మ తెలిపారు. స్థానిక ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ న్యాయవాది మధుసూదన్ ఆధ్వర్యంలో మండలంలోని కొమ్మంగి పంచాయతీ రౌరింతాడ గ్రామంలో ఏర్పాటు చేసిన న్యాయ సేవాధికార సంస్థ, వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె చట్టాలు, హక్కులపై ప్రసంగించారు. చట్టాలు, హక్కులపై అవగాహన పెంచుకొని ప్రభుత్వాలు అందిస్తున్న ఇతర సర్వీసులు, పథకాలను వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రామకృష్ణ, ఎంపీడీవో వీర సాయిబాబు, ఏ టిడబ్ల్యూఓ జయనాగలక్ష్మి, చింతపల్లి ఏరియా ఆసుపత్రి సూపరిండెండెంట్ చంద్రశేఖరరావు, సీఐ రమేష్, ఎస్సై లు అరుణ్ కిరణ్, వెంకటరమణ, ఎంఈఓ పనసల ప్రసాద్, ఐసిడిఎస్ సిడిపిఓ రమణి, ఏసీడీపీఓ రామలక్ష్మి, సూపర్వైజర్ విజయ కుమారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్ ఎం.కృష్ణమూర్తి, స్థానిక బార్ అసోసియేషన్ సభ్యులు, ప్రథమ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విశాఖ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి వెంకట శేషమ్మ

వరద బాధితులను ఆదుకోవాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి -ఎటపాక

గోదావరి, శబరి వరద బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అల్లూరి జిల్లా వరరామచంద్రపురం మండలం శ్రీరామగిరి పంచాయతీ పరిధి ముంపు గ్రామాలలో సీతారాంతోపాటు సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు, జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, శ్రీరామగిరి సర్పంచ్ పులి సంతోష్ కుమార్ తదితరులు శనివారం పర్యటించి బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ, గోదావరి, శబరి వరదలకు నాలుగు విలీన మండలాల్లో ఉన్న 380 గ్రామాలకు గానూ 53 గ్రామాలు 15 రోజుల పాటు వరద ముంపులోనే ఉండగా, 105 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం చేస్తూ నిర్వాసితుల సమస్యలను గాలికి వదిలేసిన కారణంగానే ప్రతి ఏటా ఈ పరిస్థితి దాపురిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ముందస్తు చర్యలు తీసుకోకపోవడంతో వరద బాధిత గ్రామాల ప్రజలు కొద్దిపాటి సామాన్లతో కొండలు, గుట్టల్లో గుడారాలు వేసుకొని 15 రోజుల పాటు ఉండాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వరదల వల్ల రానున్న 3 నెలలు ఈ గ్రామాల ప్రజలకు పనులు ఉండవని, ప్రస్తుతం ప్రభుత్వం ఇస్తున్న రూ.3 వేలు వరద సాయం ఎటూ సరిపోదన్నారు. మూడు నెలలకు 75 కిలోల బియ్యం, నిత్యవసర వస్తువులు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికీ రూ.10 వేలు సహాయం అందించాలని డిమాండ్ చేశారు. 160 గ్రామాల్లో పూర్తిగా, పాక్షికంగా ఇళ్లు, పశువుల నష్టం జరిగిందని, తక్షణమే ఎన్యూమరేషన్ ప్రారంభించి నష్టపరిహారాన్ని అంచనా వేయాలని కోరారు. పూర్తిగా నష్టపోయిన ఇంటికి రూ.2 లక్షలు, పాక్షికంగా నష్టపోయిన ఇంటికి రూ.1 లక్ష నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ పనులకు రైతాంగానికి గరిష్ట సాయం అందించాలని, వడ్డీలేని రుణాలు, సబ్సిడీతో విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు సరఫరా చేయాలని కోరారు. వరద ప్రభావిత గ్రామాల్లో తీవ్ర మంచినీటి ఎద్దడి ఏర్పడిందని, తక్షణం మోటార్లు, చేతి పంపులు మరమ్మతులు చేసి మంచినీటిని అందించాలన్నారు. శాశ్వత గృహాల నిర్మాణం, శాశ్వత వరద షెల్టర్లు నిర్మాణం చేయాలని, కరెంటు, రోడ్ మరమ్మతులకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. అంటువ్యాధులు ప్రబలే ప్రమాదముందని, తక్షణమే పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. కూనవరం, విఆర్.పురం, వడ్డిగూడెం తదితర గ్రామాల్లో వ్యాపార షాపులకు లక్షల్లో నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి, షాపుల పునరుద్ధరణకు వడ్డీ లేని రుణాలు మంజూరు చేయాలని కోరారు. వేలాది పశువులు ఆచూకీ లేకుండా వరదల్లో కొట్టుకుపోయాయని, సంబంధిత రైతుకు నష్టపరిహారం చెల్లించి, సబ్సిడీకి పశువుల కొనుగోలుకు సహాయం చేయాలని డిమాండ్ చేశారు.

వరద బాధితులను పరామర్శించడానికి వాగు దాటుతున్న సిపిఎం నేతలు

వరద బాధితులకు సహాయం అందజేత

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని రామవరం పంచాయతీ పరిధిలోని గ్రామాలకు చెందిన వరద బాధితులకు ఎంపీపీ కారం లక్ష్మి, సర్పంచ్ కారం బుచ్చమ్మ, పంచాయతీ సెక్రెటరీ తాతారావు, సిపిఎం నాయకుల చేతుల మీదుగా శనివారం వరద సాయం అందజేశారు. రామవరం, అడివివెంకన్నగూడెం, రామవరం పాడు, లక్ష్మీ నగరం గ్రామాల్లో వరద బాధితులకు సహాయం కింద రూ.3 వేలు చొప్పున పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వరదల వల్ల ఇళ్లు మునిగిపోయి, రహదారులు బంద్ అయి అడవుల్లో గుడారాలు వేసుకొని నానా ఇబ్బందులు పడ్డారని తెలిపారు. పోలవరం బాధితులకు తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇచ్చి పునరావాస కాలనీలకు తరలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కారం సుందరయ్య, వడ్లాది రమేష్, కారం సత్యం, ఉప సర్పంచ్ భాగ్యలక్ష్మి, వరద బాధితులు పాల్గొన్నారు..

చింతూరు : మండలంలోని గుబేలు పేట, ఎస్టి కాలనీ, బీసీ కాలనీ, మెయిన్ రోడ్ చెందిన వరద బాధితులకు విఆర్ఓ రామచంద్రరావు ఆధార్ కార్డు, పాత రేషన్ కార్డు ఆధారంగా కుటుంబానికి మూడు వేల రూపాయలు చొప్పున శనివారం అందజేశారు. ఒకేసారి వందల సంఖ్యలో ప్రజలు గుమిగూడటంతో చెల్లింపులు కాస్త నెమ్మదించాయి. మరో రెండు రోజుల్లో మండలం మొత్తం ముంపు గురైన వరద బాధితులకు పరిహారం పూర్తిగా అందే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

బాధితులకు వరద సాయం అందిస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సర్పంచ్ బుచ్చమ్మ

సున్నం రాజయ్య ఆశయ సాధనకు పునరంకితం

4వ వర్ధంతి సభలో సిపిఎం నేతలు

రాజయ్య చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎటపాక మండల నేతలు

ప్రజాశక్తి- ఎటపాక

భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, ఆదివాసీ ముద్దు బిడ్డ, అమరజీవి కామ్రేడ్ సున్నం రాజయ్య ఆశయ సాధనకు పునరంకితం కావాలని పలువురు సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. సున్నం రాజయ్య 4వ వర్ధంతి సభ ఎటపాక మండలం ఎర్రబోరులో ఇరప సత్యం అధ్యక్షతన శనివారం జరిగింది. తొలుత సున్నం రాజయ్య చిత్రపటానికి సిపిఎం మండల కార్యదర్శి ఐవి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతంలో చట్టాలను కాపాడుతూ ప్రజలందరి కోసం నిరంతరం కష్టపడి పనిచేశారని తెలిపారు సిపిఎం ప్రజా ప్రతినిధి అంటే ఎలా ఉండాలో నిరూపించిన వ్యక్తి సున్నం రాజయ్య అని కొనియాడారు. సున్నం రాజయ్య స్ఫూర్తితో ప్రజా సేవ చేస్తూ, పార్టీని బలోపేతం చేయడమే ఆయనకు ఇచ్చే ఘన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు కాకా అర్జున్, పి.బాలకృష్ణ, బుద్ధుల భద్రయ్య, జి హుస్సేన్, సోయం వీరమ్మ, పొడియం రత్తమ్మ, బండారు స్టాలిన్, నూతలపాటి సుధాకర్, తోట శ్రీను, పసుపులేటి ప్రవీణ్, తాటి అశోక్, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కూనవరం : స్థానిక సీపీఎం మండల కార్యాలయంలో శనివారం జరిగిన సున్నం రాజయ్య 4వ వర్ధంతి సభ ఆయన చిత్ర పటానికి సిపిఎం నాయకులు నివాళులర్పించారు. ఈసందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు మాట్లాడుతూ పేదలు, ముఖ్యంగా గిరిజనుల పక్షాన పోరాడిన యోధుడు రాజయ్య అని కొనియాడారు. వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య మాట్లాడుతూ రాజయ్య పోలవరం నిర్వసితుల తరపున పోరాడినట్లు గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నాగమణి, గడ్డిపాటి షణ్ముకేశ్వరరావు, తలగాని నాగరాజు, న్యాయవాది రవి తేజ, శ్యామల కృష్ణ, నోముల సత్యనారాయణ, సర్పంచ్ బొగ్గా రామారావు, బొగ్గా వెంకమ్మ, కొండా ఈశ్వర్లు పాల్గొన్నారు.

చింతూరు : పోలవరం నిర్వాసితుల సమస్యల పరిష్కారానికై ఐక్యంగా ఉద్యమించడమే సున్నం రాజయ్యకి నిజమైన నివాళి అని సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ అన్నారు. సిపిఎం చింతూరు కార్యాలయంలో రాజయ్య నాలుగో వర్ధంతి సభలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పోడియం లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సభలో సురేష్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో భద్రాచలం నియోజకవర్గం నుండి మూడు దఫాలుగా సిపిఎం ఎమ్మెల్యేగా గెలిచి గిరిజన పేదల సమస్యల పరిష్కారం కోసం నిత్యం పని చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు మల్లం సుబ్బమ్మ, మడకం చిన్నయ్య, మొట్టం రాజయ్య, పల్లపు రాములు, తేపల్ల లక్ష్మయ్య, చింత రాంబాబు, రమణ పాల్గొన్నారు.

చింతూరులో...

రాజవొమ్మంగి : సున్నం రాజయ్య స్ఫూర్తితో గిరిజన హక్కులకై పోరాడాలని సీపీఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, పిలుపునిచ్చారు. స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన రాజయ్య 4వ వర్ధంతి కార్యక్రమంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం సీపీఎం మండల నాయకులు పి పాపారావు అధ్యక్షతన జరిగిన సభలో రామారావు మాట్లాడుతూ ఆదివాసీల సమస్యలతో పాటు రాష్ట్రంలోని పేదల సమస్యలపై అనేక పోరాటాలు చేసిన రాజయ్య, ఎమ్మెల్యేగా వాటిపై అసెంబ్లీలో గళమెత్తారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కొండ్ల సూరిబాబు, కె జగన్నాధం, పాండవుల సత్యనారాయణ, కొత్తూరు సత్యనారాయణ, రాంబాబు, ఎం రమేష్., రామరాజు, టి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విఆర్.పురం : సున్నం రాజయ్య స్వగ్రామం మండలంలోని చిన్నమట్టపల్లి పంచాయతీ పరిధి సున్నవారిగూడెంలో ఆయన స్థూపం వద్ద సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, రాజయ్య తల్లి కన్నమ్మ, భార్య సుక్కమ్మ, కుమారులు చంద్రరావు, సీతారామరాజు, సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మర్లపాటి నాగేశ్వరరావు తదితరులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం రాజయ్య ఇంటి వద్ద వర్ధంతి సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పూనం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు పల్లపు వెంకట్, సీసం రమేష్, పంకు సత్తిబాబు, కుంజ నాగిరెడ్డి, కారం సుందరయ్య, కారం సత్యం, పులి ధర్మరాజు, కారం సత్తిబాబు, పులి బుజ్జి, తుర్రం బాబురావు, చిక్కాల రామారావు, కాంతారావు, సత్యనారాయణ, జి నాగేంద్రబాబు, ఎంపీపీ కారం లక్ష్మి, ఎంపీటీసీ పూనం ప్రదీప్ కుమార్, సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, పులి సంతోష్ కుమార్, పూనం సరోజిని, ఏఎస్‌డిఎస్ అధినేత గాంధీ బాబు, నాయకులు తాతబాబు రెడ్డి, కుటుంబ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పాడేరు : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ గిరిజన ఎమ్మెల్యే సున్నం రాజయ్య నాలుగోవ వర్ధంతి జిల్లా కేంద్రంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యాలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రాజయ్య చిత్రపటానికి ఆదివాసి గిరిజన సంఘం జాతీయ నాయకులు పి.అప్పలనరసయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు బి.చిన్నయ్య పడల్, జిల్లా అధ్యక్షుడు ఎస్.ధర్మాన పడాల్ పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా అప్పలనరస మాట్లాడుతూ, సున్నం రాజయ్య గిరిజనుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలని ప్రభుత్వం పై ఉద్యమించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు సత్యనారాయణ, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు .కార్తీక్, జీవన్ పాల్గొన్నారు.



రాజవొమ్మంగిలో లోతా రామారావు తదితరులు

పాడేరులో అప్పలనరస తదితరులు...

పలుచోట్ల తల్లిపాల వారోత్సవాలు

అవగాహన పరుస్తున్న సిడిపిఒ వరహాలమ్మ

ప్రజాశక్తి-పెదబయలు: మండల కేంద్రంలోని అంగన్వాడీ కేంద్రాల్లో ఇంచార్జి సీడీపీఓ వరహాలమ్మ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. లకేపుట్, సీతగుంట , తమరాడ, గాదేపల్లి, ఇదులాపుట్, సీకారి 1, 2, పెద్దాపుట్ తదితర గ్రామాల్లో అవగాహనా ర్యాలీలు నిర్వహించామని వరహాలమ్మ తెలిపారు. తల్లి పాల ఉపయోగాలపై వివరించామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్స్ హేమ, సింహాచలం, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

హుకుంపేట: స్థానిక అంగన్వాడి కేంద్రం వద్ద శనివారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సిడిపిఓ సిహెచ్ బాలమణి దేవి గర్భిణీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

అనంతగిరి: మండల పరిషత్ కార్యాలయం వద్ద సిడిపిఓ సిహెచ్ సంతోషి కుమార్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి ఎన్.సూర్యలక్ష్మి హాజరై మాట్లాడారు. పౌష్టికాహారాన్ని గర్భిణిలు, బాలింతలు, చిన్నారులు క్రమం తప్పకుండా తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపీడీవో నగేష్, స్థానిక వైద్య అధికారిణి జ్ఞానేశ్వరి, ఇన్చార్జి తహసిల్దార్ మాణిక్యం పాల్గొన్నారు.

జి మాడుగుల: మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాపై ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డిడిఒ రవిచంద్రశేఖర్, డాక్టర్ టి శశికాంత్, ఆరోగ్య విస్తరణాధికారి ఎన్ ప్రకాష్‌రావు, అంగన్వాడి సిడిపిఓ సువర్ణమ్మ పాల్గొన్నారు.

డుంబ్రిగుడ: తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని ఐసిడిఎస్ శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐసిడిఎస్ కార్యాలయంలో తల్లిపాలతో కలిగే లాభాలపై గర్భిణీలు, మహిళలకు అధికారులు అవగాహన పరచడంతో పాటు శానిటేషన్ పనులు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో జయ ఉమా, సిడిపిఓ నీలిమ, ఎంపీఈవో శౌరి, ఐసిడిఎస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అరకులోయ : తల్లిపాలతోనే బిడ్డకు మెరుగైన ఆరోగ్యం కలుగుతుందని సిడిపిఓ శారద అన్నారు. మండలంలోని రవ్వలగూడ గ్రామంలో శనివారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా ఆ గ్రామంలోని తల్లులకు గర్భిణీలకు అవగాహన కల్పించారు. ఆకుకూరలు తీసుకోవడంతో ఆరోగ్యకరంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్లు అరుణ, పార్వతి, లక్ష్మి, ఆశా, కార్యకర్తలు, అంగన్వాడీలు పాల్గొన్నారు.

అరకులోయ రూరల్: మండలంలోని మాడగడ పిహెచ్ సి పరిధి అంగన్వాడి కేంద్రంలో అంగన్వాడీ సిబ్బంది, హెల్త్ డిపార్టెమెంట్ సిబ్బంది ఆధ్వర్యంలో శనివారం తల్లిపాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐసిడిఎస్ సీడిపిఓ శారద మాట్లాడుతూ, ఆరు నెలల వరకు తల్లి పాలు మాత్రమే పట్టించాలని సూచించారు. మాడగడ పిహెచ్‌సి హెల్త్ సిబ్బంది కుమారి, అంగన్వాడీ సూపర్వైజర్లు పార్వతి, అరుణ, అమ్మకుమారి పాల్గొన్నారు.

మారేడుమిల్లి : మారేడుమిల్లి అంగన్వాడీ కేంద్రం-2లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ లక్ష్మీ ప్రసన్న మాట్లాడారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్ ఎస్.ప్రశాంతి, ఏబీపీ ఎం.మనస్విని, అంగన్వాడీ వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ కమల కుమారి

దాబుగూడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-అరకులోయరూరల్: మండలంలోని మాదల పంచాయతీ దాబుగూడ గ్రామంలో శనివారం శ్రీ శ్రీ ఇన్ ఫ్రా ఎండి శ్రీనివాసరావు 60 వేల ఆర్థిక సహాయంతో శారదా ట్రస్ట్, ఆదివాసీ గిరిజన సంఘం, అల్లూరి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గన్నెల పిహెచ్ సి డాక్టర్ కమల కుమారి పర్యవేక్షణలో ఉచిత మెడికల్ క్యాంపు నిర్వచించారు. ఈ మెడికల్ క్యాంపులో పరిసరాల గ్రామాలైన దోమలుజోరు, రక్త కండి, దాబుగూడ సరుబెడ్డ, పొట్టంగిపాడు గ్రామాల వచ్చి వైద్యం చేయించుకున్నారు. రక్తహీనత, నడుము నొప్పి, జలుబు, దగ్గు, గజ్జి చర్మ వ్యాదులతో బాధ పడుతున్న100 మందికి టెస్టులు చేసి ఉచితంగా మందులు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, మండల అధ్యక్షులు గత్తుం బుజ్జి బాబు, మండల నాయకులు కుమిడి రమేష్, పాంగి రామన్న కె. రామారావు, టి.శ్రీను, మాదాల పంచాయతీ సర్పంచ్ వంతాల శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ, గన్నెల పిహెస్సి సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ కళాశాలలు ఆదివారం సెలవు పాటించాల్సిందే : ఆర్ఐఒ మురళీధర్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాలు, రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు విశాఖ ఉమ్మడి జిల్లాలో అన్ని యాజమాన్యాల ఇంటర్మీడియట్ కళాశాలలు ఆదివారం, రెండో శనివారం, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో ఎట్టి పరిస్థితుల్లో కళాశాలలు తెరవడానికి వీల్లేదని, సెలవులు పాటించాల్సిందే ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ పి.మురళీధర్ శనివారం ఆదేశాలు జారీ చేశారు. ఏ కళాశాలకూ మినహాయింపులు ఉండబోవని స్పష్టంచేశారు.

రహదారులకు మరమ్మతు చేయాలి

పిఒకు ఆదివాసీ గిరిజన సంఘం వినతి

పిఒకు వినతిపత్రాన్ని ఇస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

ప్రజాశక్తి -పాడేరు: తుఫాను ప్రభావిత గ్రామాల్లో రోడ్లు మరమ్మత్తులు చేయాలని కోరుతూ ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ కు శనివారం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు సాగిన ధర్మన్న పడాల్, జిల్లా ఉపాధ్యక్షులు వి.దాసు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు జిల్లా 11 మండలాల పరిధిలో సుమారు 3915 గ్రామాలు ఉన్నాయని, సుమారు 7 లక్షల మంది ప్రజలు జీవిస్తున్నారని తెలిపారు. సుమారు 2191 గ్రామాలకు పక్కా రోడ్లు లేవన్నారు. గిరిజనులు కొండలు, వాగులు, వంకలు దాటుకుంటూ ప్రధానమైన రహదారికి చేరుతున్నారని, గర్భిణీ మహిళలకు పురిటి నొప్పుల సందర్భంలో డోలి మోతలతో తీవ్ర అవస్థలు పడుతున్నారని వివరించారు. ఇటీవల సంభవించిన తుఫాను కారణంగా ముంచంగి పుట్టు మండలంలో లక్ష్మీపురం పంచాయతీకి మూడు కిలోమీటర్ల దూరంలో కూడాపుట్టు గ్రామానికి వంతెన రహదారి లేకపోవడంతో .మండల కేంద్రం. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో చేరడానికి సుమారు 70 కిలోమీటర్లు ఒడిశా రాష్ట్రం నుండి చుట్టూ తిరిగి తీసుకురావడంతో సకాలంలో వైద్యం అందలేదని, దీంతో, గర్భిణీ స్త్రీ ప్రసవంలో బిడ్డ మృతి చెందిందని తెలిపారు. గతంలో మిషన్ కెనెక్ట్ పాడేరు పేరిట అధికారులు మారుమూల ప్రాంతాల్లో రోడ్డు నిర్మాణానికి తొలి విడతలో 273 కోట్లతో 454 రోడ్లు నిర్మాణానికి చర్యలు ప్రారంభించారని, .రోడ్డు వేయకుండానే అనంతగిరి మండలం, కొన్ని మండలాల్లో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు నిధులు డ్రా చేసారని తెలిపారు. మరికొన్ని చోట్ల నాసిరకం రోడ్లు నిర్మాణం చేపట్టారన్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కై నాసిరకం రోడ్లు, వంతన నిర్మాణం చేపట్టారన్నారు.

ఆశ్రమ పాఠశాలల్లో వైద్యశిబిరాలు నిర్వహించాలి

ప్రజాశక్తి-డుంబ్రిగుడ

గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎస్‌బి పోతురాజు డిమాండ్ చేశారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం కురిసిన వర్షాల కారణంగా ఆశ్రమ పాఠశాలల్లోని విద్యార్థులకు జలుబు, దగ్గు, జ్వరం వంటి వ్యాధులు సోకడంతో ఇబ్బంది పడుతున్నారన్నారు. గతంలో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై చూసుకునేందుకు హెల్త్ వాలంటీర్లు ఉండటంతో విద్యార్థులకు ఎటువంటి వ్యాధులు వచ్చినా వెంటనే హాస్పిటల్ కు తరలించి వైద్య సేవలు సకాలంలో అందించే వారని చెప్పారు. సుమారు గత ఐదేళ్ల నుంచి వారిని విధుల నుంచి తొలగించడంతో సకాలంలో వైద్య సేవలు అందక పలువురు విద్యార్థులు మృతి చెందుతున్నారని చెప్పారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి గతంలో మాదిరిగా ఆశ్రమ పాఠశాలల్లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని ఆయన కోరారు.

ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్ఒ ఆదేశాలతో అంబులెన్స్ ఏర్పాటు

ప్రజాశక్తి-సీలేరు: విశాఖ కెజిహెచ్‌లో మృతి చెందిన శిశువును తరలించడానికి ఐటిడిఎ పిఒ, డిఎంహెచ్ఒల ఆదేశాలతో కెజిహెచ్ అధికారులు అంబులెన్స్ ఏర్పాటు చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా జీకే వీధి మండలం దారకొండ పంచాయతీ కమ్మరితోట గ్రామానికి చెందిన రెడ్డి శివ అచ్చమ్మ దంపతులకు రెండు నెలల క్రితం మగ శిశువు జన్మించగా, ఆ ఊపిరితిత్తుల (న్యుమోనియా) వ్యాధికి గురయ్యాడు. స్థానిక పిహెచ్‌సి, చింతపల్లి సిహెచ్‌సి, నర్సీపట్నం ఏరియా ఆసుపత్రుల్లో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖ కెజిహెచ్‌కు తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతదేహాన్ని స్వగ్రామం తరలించడానికి అంబులెన్స్ కావాలని విశాఖ కేజీహెచ్ సిబ్బందిని తల్లిదండ్రులు కోరగా సంవత్సరం నిండితేనే మహాప్రస్థానం అంబులెన్స్ ఇస్తామని చెప్పారు. శిశువును కోల్పోయి పుట్టెడు దు:ఖంలో ఉన్న తల్లిదండ్రులు మృతదేహాన్ని స్వగ్రామానికి ఎలా తీసుకెళ్లాలో తెలియక తల్లడిల్లిపోయారు. ఈ నేపథ్యంలో అంబులెన్స్ ఏర్పాటు చేయాలని బాధితులు పాడేరు ఐటిడిఏ పిఓ అభిషేక్, డిఎంహెచ్ఓను కోరగా వెంటనే స్పందించి కేజీహెచ్ ఎస్టీ సెల్ సిబ్బందికి ఆదేశాలు ఇచ్చారు. దీంతో అంబులెన్స్ ఏర్పాటు చేయడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి శనివారం ఉదయం తరలించారు.

ఎంఇఒగా సత్యనారాయణ దొర

బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి ఎంఈఓగా కెవివి సత్యనారాయణ దొర శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎంఈఓ కె తాతబ్బాయి దొర ఇటీవల బదిలీపై వై.రామవరం వెళ్లారు. ఇప్పటివరకు కొయ్యూరు ఎంఈఓ రాంబాబు ఇంచార్జ్ ఎంఈఓగా కొనసాగారు. రాంబాబు నుండి సత్యనారాయణ దొర శనివారం బాధ్యతలు స్వీకరించారు, ఈ సందర్భంగా ఎంఈఓ సత్యనారాయణ దొరను కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు,

తునికాకు సేకరణ కూలి చెల్లించాలి

నెల్లిపాక రేంజ్ ఆఫీసర్‌కు సిపిఎం ఆధ్వర్యాన వినతి

ఫారెస్ట్ రేంజర్‌కు వినతిపత్రంఇస్తున్న సిపిఎం నేతలు, కూలీలు

ప్రజాశక్తి-ఎటపాక : 2024 సీజన్‌లో తునికాకు సేకరణ కట్ట డబ్బులు చెల్లించాలని సిపిఎం ఆధ్వర్యంలో తునికాకు కార్మికులు నెల్లిపాక రేంజ్ ఆఫీసర్‌కు శనివారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి ఐవి మాట్లాడుతూ ఉపాధి హామీ డబ్బులు రాక, తునికాకు సేకరణ కట్ట కూలి డబ్బులు కూడా రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. తక్షణమే పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించాలని రేంజ్ ఆఫీసర్ ను కోరారు. 2012 నుండి పెండింగ్లో ఉన్న తునికాకు బోనస్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. దీనికి అధికారులు స్పందిస్తూ పది రోజుల్లో పూర్తి బకాయిలు చెల్లిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎపి ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు కాకా అర్జున్ దొర, బుద్దుల భద్రయ్య, ఇరపా సత్యం, తునికాకు కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివాసీ దినోత్సవం నిర్వహణకు చర్యలు

ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం

సమావేశంలో మాట్లాడుతున్న ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్

ప్రజాశక్తి-రంపచోడవరం :ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవం అన్ని గిరిజన తెగల సమక్షంలో ఘనంగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్ట సింహాచలం పేర్కొన్నారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో పిఒ సింహాచలం, రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్.ప్రశాంత్ కుమార్‌తో కలిసి అన్ని గిరిజన తెగల గిరిజనులు, వివిధ శాఖలకు సంబంధించిన అధికారులతో ముందస్తు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ గిరిజన తెగల్లో బేధాభిప్రాయాలు లేకుండా పార్టీలకు అతీతంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఘనంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. అన్ని గిరిజన తెగల పెద్దలకు సముచిత ప్రాధాన్యం ఇవ్వడం జరుగుతుందన్నారు. రంపచోడవరం సబ్ కలెక్టర్ యస్. ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ ఏజెన్సీలోని గిరిజనుల అభివృద్ధికి ఒక మిషన్ ప్లాన్ తయారు చేసి జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్తామని తెలిపారు. ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోత రామారావు మాట్లాడుతూ గిరిజనులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా తగు చర్యలు చేపట్టాలని, గిరిజన చట్టాలు పరిరక్షించాలని కోరారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని గ్రామస్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. గిరిజన నాయకులు కత్తుల ఆదిరెడ్డి, బి.వరప్రసాద్, గొర్లె బాలాజీ బాబు, లక్కుండ రవికుమార్, లంక వెంకటేశ్వరరావు, సమర్త కృష్ణ, కెఆర్‌పి.కుమార్, కిందుకూరి లక్ష్మణరావు, గొర్లె చిన్న నారాయణరావు, సత్యప్రసాద్, కొమ్మిశెట్టి బాలకృష్ణ తదితరులు పలు సమస్యలపై మాట్లాడారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ సిహెచ్ శ్రీనివాసరావు, పరిపాలన అధికారి డివిన్వి రమణ, ఎస్‌ఓ టి మార్తమ్మ, పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ షరీఫ్, ఎన్‌ఆర్‌ఇజిఎస్ ఏపిడి జి.శ్రీనివాసరావు, పిహెచ్‌ఓ చిట్టిబాబు, గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.డేవిడ్ రాజ్, ఎంపీడీవోలు హరికృష్ణ, వీర కిషోర్, ఏజెన్సీ డీఈవో వై.మల్లేశ్వరరావు, ఏడిఎంహెచ్‌ఓ జి.శిరీష, డిడి కార్యాలయం సూపరింటెండెంట్ బి.కిషోర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చైతన్య, సాయి సతీష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధికి ప్రణాళిక ఏర్పాటు చేయాలి

చట్టాలు పగడ్బందీగా అమలుచేయాలి : ఆదివాసీ అఖిలపక్షం డిమాండ్

సమావేశానికి హాజరైన ఆదివాసీ అఖిలపక్షం నేతలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : గిరిజనుల అభివృద్ధికి ఐటిడిఎ ప్రణాళికలు ఏర్పాటు చేయాలని, గిరిజన చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పలు ఆదివాసీ సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివాసీ వర్తక కేంద్రం వద్ద శనివారం మండల అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. ఆదివాసీ యువ నాయకులు ఈతపల్లి సిరిమల్లి రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఏజెన్సీలో రోడ్లు, మంచినీరు, మౌలిక సదుపాయాలు వంటివి కల్పించాలని, ఆదివాసీల విద్య, ఆరోగ్యం పట్ల దృష్టి పెట్టాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ అమలు చేయాలని, పీసా చట్టం, గ్రామసభలు నిర్వీర్యమైపోతున్న వేళ వాటిని పరిరక్షణ కోసం ఉద్యమించాలని నిర్ణయించారు.

ఎకో టూరిజం ద్వారా గిరిజన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించాలని, వ్యాపార స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. మారేడుమిల్లి మండల కేంద్రంలో బస్సు షెల్టర్ నిర్మించాలని, ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, జీవో నెంబర్ 3ని అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ శాఖల్లో ఎస్సీ, ఎస్టీ బ్లాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని కోరారు. ఈ సమస్యలను ఐటీడీఏ పీవో, కలెక్టర్, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం ఆదివాసీ యువతను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో ఆదివాసీ నాయకులు గొర్లె బాలాజీబాబు, జి మురళీకృష్ణ, జి చిన్న నారాయణరావు, మట్ల వాణిశ్రీ, ఈ.సత్యనారాయణ రెడ్డి, కొండ జాకబ్, ఎల్.రవికుమార్, ఎస్.లలితకుమారి, జి.అనిల్ ప్రసాద్, వీకా రాజన్న దొర, కానెం విజయలక్ష్మి, వి.లచ్చిరెడ్డి, జి. బాబురావు, డి.బ్రహ్మజీ, డి.ప్రణీత్, ఎస్.లింగారెడ్డి, కుండ్ల ప్రభాకర్ రెడ్డి, డి.సువర్ణ కర్ణ కుమార్, బి.రాధాకృష్ణారెడ్డి బి.రమణారెడ్డి, కె మొట్టి రెడ్డి, కె వీరప్రు రెడ్డి, ఆదివాసీలు పాల్గొన్నారు.

8న పాఠశాల కమిటీ ఎన్నికలకు తల్లిదండ్రులు హాజరు కావాలి

ప్రజాశక్తి-వై.రామవరం : ఈ నెల 8న జరుగు పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలకు విద్యార్థుల తల్లిదండ్రులు హాజరు కావాలని ఎంఇఒ తాత అబ్బాయిదొర విజ్ఞప్తి చేశారు. స్థానిక సంత మార్కెట్లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలల్లో శనివారం పలు ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వై.రామవరం మండలంలో 115 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో పాఠశాల నిర్వహణ కమిటీ ఎన్నికలు ఈ నెల జరగనున్నాయని చెప్పారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికలకు తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారు హాజరయ్యేలా అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేరాలు ఘోరాలు

భార్యను కడతేర్చిన భర్త

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలోని బల్లుగుడ సమీపంలో గత నెల 31న అనుమానాస్పదంగా వివాహిత మృతి చెందిన సంఘటనపై దర్యాప్తు చేయగా కట్టుకున్న తన భర్తయే హతమార్చినట్లు స్థానిక సీఐ రవి శేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని స్థానిక పోలీస్ స్టేషన్‌లో హత్య చేసిన నిందితుడిని అదుపులో తీసుకొని శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత నెల 31న బల్లుగుడ గ్రామానికి చెందిన నిందితుడు ఎస్ రాజ్ కుమార్ తన భార్య దేవిని హత్య చేసి పరారయ్యాడన్నారు. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేయగా తన భర్త హత్య చేసినట్లు దర్యాప్తులో రుజువు కావడంతో ఒడిస్సా వైపు నుంచి వస్తున్న అతనిని జైపూర్ జంక్షన్‌లో అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్ కు తరలించడం జరుగుతుందని సిఐ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సంతోష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి- హుకుంపేట: స్థానిక సాయిబాబా గుడి వీధిలో ఉంటున్న ఓ వ్యక్తి మద్యానికి బానిసై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సిఐ సన్యాసిరావు తెలిపిన వివరాల ప్రకారం... స్థానికంగా ఉంటున్న మజ్జి కృష్ణ (34) తన ఇంటిలో పడక గది పై దూలానికి చున్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చు అని సిఐ పేర్కొన్నారు. శనివారం ఉదయం మృతుడు గది తలుపులు తీయకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామస్తులు సహాయంతో తలుపులు తెరిచి చూడగా అప్పటికే చనిపోయి ఉన్నాడు. గతం సంవత్సరం మృతుని కుమారుడు చనిపోవడంతో మద్యానికి బానిసై ఉరేసుకుని చనిపోయి ఉండవచ్చు అని మృతిని భార్య సుజాత ఇచ్చిన పిర్యాదు పై కేసు నమోదు చేశామన్నారు. మృతదేహాన్ని పాడేరు జిల్లా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించామన్నారు.

వారోత్సవాలను నియంత్రించాం : సిఐ

ప్రజాశక్తి - చింతపల్లి :- ప్రత్యేక పోలీసు బలగాలతో సమన్వయం చేసుకొని చింతపల్లి సర్కిల్ పరిధిలో మావోయిస్టు అమరవీరుల వారోత్సవాలలో ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, విధ్వంసకర కార్యకలాపాలు చోటు చేసుకోకుండా నియంత్రించ గలిగామని సీఐ రమేష్ అన్నారు. స్థానిక ఎస్సైలు అరుణ్ కిరణ్, వెంకటరమణలతో కలిసి ఆయన మాట్లాడుతూ, మావోయిస్టు వారోత్సవాలను నియంత్రించేందుకు ప్రత్యేక పోలీసు బలగాలతో అనునిత్యం తనిఖీలు నిర్వహించామన్నారు. గత నెల 28 నుండి మావోయిస్టులు నిర్వహించ తలపెట్టిన వారోత్సవాలను భగ్నం చేసేందుకు ఇరవై రోజులుగా మన్య ప్రాంతంలో ముమ్మరంగా కూంబింగ్‌లు, బాంబ్, డాగ్ స్క్వాడ్‌లతో తనిఖీలు నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్య కూడళ్లలో ప్రతినిత్యం పహారా నిర్వహించామని తెలిపారు. మావోయిస్టులకు ఎవరో సహకరించవద్దని ఆయన పిలుపునిచ్చారు.

ఆశ్రమాల్లో విద్యార్థుల మరణాలను అరికట్టాలి

ఐటిడిఎ పిఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి -పాడేరు : ఐటిడిఏ పరిధిలో సుమారు 11 మండలలో గిరిజన ఆశ్రమ పాఠశాలలు గురుకుల కళాశాలలలో తరచు గిరిజన విద్యార్థులు అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నారని, ఈ ఏడాది రెండు నెలల్లో ఐదు మంది విద్యార్థిని, విద్యార్థులు చనిపోయారని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కార్తీక్ శ్రీను, జీవన్ కృష్ణ తెలిపారు. ఈ మేరకు శనివారం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ దృష్టికి తీసుకువచ్చారు. ఏజెన్సీ వ్యాప్తంగా ఆశ్రమాల్లో గిరిజన విద్యార్థుల మరణాలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గూడెం మండలం సప్పర్ల బాయ్స్ స్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థి జర్త, సామియేలు పచ్చకామర్లతో చనిపోయారన్నారు. డుంబ్రిగూడ మండలం సొవ్వ గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థి ఏడవ తరగతి చదువుతున్న లాజర్, కొయ్యూరు మండలం పెద్ద మాకవరం గర్ల్స్ స్కూల్ తొమ్మిదో తరగతి చదువుతున్న పాంగి అంజలి చనిపోయారని తెలిపారు. ఈ విద్యార్థుల మరణాలపై సమగ్ర విచారణ జరిపించాలని వారు కోరారు. గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకుల కళాశాలలో హెల్త్ అసిస్టెంట్లను, ఎఎన్ఎంలను. నియమించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు అభ్యర్థించారు.. చనిపోయిన విద్యార్థుల తల్లిదండ్రులకు ఉద్యోగం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు చిన్నారావు, జాయింట్ సెక్రెటరీ సింహాద్రి పాల్గొన్నారు.

విద్యుదుత్పత్తికి సరిపడా నీటి నిల్వలు

జెన్‌కో ఎస్ఇ చంద్రశేఖరరెడ్డి

ప్రజాశక్తి-సీలేరు : సీలేరు కాంప్లెక్స్‌లో ఈ ఏడాది విద్యుత్ ఉత్పత్తికి డోకా లేదని, సరిపడా నీటి నిల్వలు ఉన్నాయని ఏపీ జెన్కో ఇన్చార్జి ఎస్ఈ సివిల్ చంద్రశేఖర్ రెడ్డి వెల్లడించారు. స్థానిక విలేకరులతో శనివారం ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది వర్షాలు అనుకూలంగా ఉండడంతో సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి, సీలేరు జలాశయాలు నిండుకుండను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. విద్యుత్ ఉత్పత్తికి వచ్చే ఏడాది జూన్ చివరినాటి వరకు ఎటువంటి సమస్య తలెత్తదని పేర్కొన్నారు. గుంటవాడ రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 3.6 టిఎంసిలు కాగా ప్రస్తుతం 2.3 టిఎంసిలు నీటి నిల్వ ఉందని తెలిపారు. దిగువ సీలేరు డొంకరాయి రిజర్వాయర్‌లోకి ప్రస్తుతం 9000 వేలు క్యూసెక్కులు వరద నీరు వచ్చి చేరుతుందన్నారు. పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం పవర్ కెనాల్ ద్వారా 4000 క్యూసెక్కులు నీటిని వినియోగించుకోగా, మరో 4000 వేలు క్యూసెక్కులు డొంకరాయి రిజర్వాయర్ గేట్లు ద్వారా నీటిని విడుదల చేస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం డొంకరాయి జలాశయంలో 13 టీఎంసీలు నీరు నిల్వ ఉందన్నారు. బలిమెల రిజర్వాయర్ సామర్థ్యం 95 టీఎంసీలు కాగా ప్రస్తుతం 45 టీఎంసీలు నీటి నిల్వలు ఉన్నట్లు చెప్పారు. జోలాపుట్ రిజర్వాయర్ నీటి సామర్థ్యం 31.5 టిఎంసిలు కాగా ప్రస్తుతం 20 టీఎంసీలు నీరు ఉందని తెలిపారు.

ఉపాధ్యాయులకు ఐటిడిఎ పిఒ అభినందన

ప్రజాశక్తి-రంపచోడవరం : రంపచోడవరం ప్రభుత్వ శిక్షణా కళాశాలలో 2022-24 బ్యాచ్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులను ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలం శనివారం ఒక ప్రకటనలో అభినందించారు. 2022-24 బ్యాచ్ 4వ సెమిస్టర్ పరీక్ష ఫలితాలు వెలువడగా 36 మంది విద్యార్థులకు గాను అందరూ ఫస్ట్ డివిజన్‌లో ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. 2 సంవత్సరాల శిక్షణా ఫలితాలలో 2800 మార్కులకుగాను కుంజం దివ్య 2549 మార్కులు సాధించి ప్రథమ స్థానం సాధించగా, నర్సీ శివ 2510 మార్కులతో ద్వితీయ స్థానం, మడి పోసిబాబు 2504 మార్కులతో తృతీయ స్థానం, సోడే గణేశ్, మిర్తివాడ సాయి పుష్పలత 2489 మార్కులతో నాల్గవ స్థానం సాధించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను, మంచి ఫలితాలు తీసుకొచ్చిన కళాశాల ప్రిన్సిపాల్ ఎం.చినబాబు, కళాశాల అధ్యాపకులు జి భాస్కర్‌రావు, జె వెంకటలక్ష్మి, ఎం సామ్రాజ్యం, కారం బాపిరాజు దొర, డి అపర్ణ కుమారి, కె పోతురాజు, వి రాజ్ సిద్ధార్థ, పి లక్ష్మణరెడ్డిలను ఐటిడిఎ పిఒ అభినందించారు. రాబోయే బ్యాచ్‌లు కూడా మంచి ఫలితాలు సాధించడానికి కృషి చేయాలని సూచించారు.

జాతీయ రహదారిపై కూలిన భారీ వృక్షం - రాకపోకలకు అంతరాయం

చెట్టు కూలడంతో నిలిచిన రాకపోకలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన కురిసిన భారీ వర్షానికి రాజవొమ్మంగి గ్రామ శివారు మలుపు వద్ద జాతీయ రహదారి 516ఈకి అడ్డంగా శనివారం ఉదయం భారీ టేకు చెట్టు నేలకూలింది. దీంతో ఆ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. చెట్టు కూలిన సమయంలో ఆ మార్గంలో ఎవరు రాకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. విషయం తెలుసుకున్న స్థానిక ఎఫ్ఎస్ఓ రాము, సిఐ ఎస్ సన్యాసినాయుడు, ఎస్ఐ వెంకయ్య ఆధ్వర్యంలో సిబ్బంది స్థానికులతో కలిసి రహదారి అడ్డంగా కూలిన చెట్టును తొలగించి రాకపోకలను పునరుద్ధించారు. ఈ కార్యక్రమంలో పోలీసు, ఫారెస్ట్ సిబ్బంది స్థానికులు పాల్గొన్నారు.